క్లుప్తంగా

గోవులతో ప్రయోజనం



గోమాతకు పూజ చేస్తున్న ప్రతినిధులు

సంగారెడ్డి టౌన్: గోవులతో ప్రతి ఒక్కరికి ప్రయోజనం ఉంటుందని గోసేవ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం డివిజన్ స్థాయి లో గో విజ్ఞాన పరీక్షను సంగారెడ్డి మండలంలోని శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోవులతో మానవాళికి ఉపయోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డివిజన్ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పరీక్షలు ఉంటాయని వివరించారు. నాలుగు మండలాల నుంచి సుమారుగా 360 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. కార్యక్రమంలో శిశు మందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహగౌడ్, ముఖ్యఅతిథులు లింగా గౌడ్, చంద్రశేఖర్ శర్మ, పెంటారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

16న ఉచిత కంటివైద్య శిబిరం

నారాయణఖేడ్: సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ నానక్ రాంగూడలోని శంకర ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఖేడ్‌లోని సత్యసాయి మందిరంలో ఈనెల 16న ఉ.9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ శంకరప్ప తెలిపారు. కంటిపొరలు వచ్చిన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్, ఏవైనా మందులు వాడుతుంటే వాటిని తీసుకువచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రమదానంతో మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న కాలనీవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్ఆర్30 ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఆదివారం గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు శ్రమదానంతో మరమ్మతులు చేశారు. అనంతరం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ.. పదేళ్లుగా ఆర్ఆర్30 ఎక్స్‌టెన్షన్ రోడ్డును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డుపై పెద్ద ఎత్తున మట్టి చేరడంతో పాటు గుంతల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదని వాపోయారు. ఇప్పటికే ప్రమాదాల్లో వందలాది మంది మృతి చెందారని తెలిపారు. తమ బాధను పాలకులకు తెలపాలన్న ఉద్దేశంతో తమే శ్రమదానంతో మరమ్మతులు చేస్తున్నామని వివరించారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి



అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బేగంపేట హైదరాబాద్ జాతీయ సేవా పథకం చైర్మన్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి ఆధ్వర్యంలో వాలంటీర్లు ఆదివారం పటాన్‌చెరు మండలం ఐనోల్, పెద్ద కంజర్ల గ్రామాల్లో ఈ సేవా, స్వచ్ఛతా మీ సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ప్లాస్టిక్ చెత్తను తొలగించి పరిశుభ్రం చేశారు. గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీని నిర్వహించి ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కల్హేర్(నారాయణఖేడ్): పేకాట స్థావరంపై దాడి చేసి కేసు నమోదు చేసినట్లు కల్హేర్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజాంపేట్ మండలం రాంరెడ్డి పేట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. పుట్టి సంగయ్య ఇంటి ఎదుట సీసీ రోడ్డుపై బహిరంగంగా పేకాట ఆడుతున్న 7 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 3,0700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి కూలీలకు ఈ కేవైసీ

- అక్రమాలకు చెక్ పెట్టేందుకే నిర్ణయం
- జిల్లాలో కొనసాగుతున్న ఈ కేవైసీ నమోదు
- 47.46 శాతం పూర్తి చేసిన అధికారులు నమోదు చేసుకున్న వారికే పని కల్పన



ఈకేవైసీ నమోదు చేస్తున్న ఉపాధి అధికారులు

జిల్లాలో యాక్టివేషన్‌లో ఉన్న కూలీలు
208545
ఈకేవైసీ నమోదు అయిన కూలీల సంఖ్య
98968
జిల్లాలో నమోదు శాతం
7.46

సంగారెడ్డి జోన్: ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆన్‌లైన్ హాజరు విధానంతో పాటు ప్రతి కూలీ నాలుగు గంటల సమయం పనులు చేసేలా రెండు పూటలా ఫొటోలు తీసే విధానం అమలు అవుతుంది. తాజాగా ఉపాధి హామీ కూలీలకు ఈ కేవైసీ(ఎలక్ట్రానిక్ నాలెడ్జ్ యువర్ కస్టమర్) నమోదు విధానాన్ని తీసుకువచ్చింది. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ నమోదు చేసుకుంటేనే పనులకు హాజరయ్యే నిబంధన ఉంది. దీంతో ప్రస్తుతం ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది ఈకేవైసీ నమోదు పనిలో నిమగ్నమయ్యారు.

పారదర్శకంగా ఉండేందుకు..

గతంలో ఉపాధిలో పని చేసే కూలీలకు మ్యానువల్‌గా హాజరు వేసేవారు. దీంతో పనులకు రాకుండా వచ్చినట్లుగా హాజరు వేయడంతో పాటు ఇష్టారీతిగా వేతనాలు చెల్లింపు, పనులు చేసినట్లు చూపించడంతో పాటు తదితర అక్రమాలు సోషల్ ఆడిట్ ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టి పారదర్శకంగా అమలు చేసేందుకు అనేక రకాల సంస్కరణలను చేపట్టింది. ఇటీవల పనులకు హాజరయ్యే కూలీల ఫొటోలు పని ప్రారంభం ముందు, పని పూర్తయిన తర్వాత రెండుసార్లు ఫొటో తీసి హాజరు అయ్యే విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. కనీసం నాలుగు గంటల సమయం పనిచేస్తేనే హాజరు ధ్రువీకరణ అయ్యేలా రూపకల్పన చేశారు.

నమోదు చేసుకుంటేనే పని..

ఉపాధి హామీలో జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి కూలీ ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. తప్పనిసరిగా నమోదు అయి ఉంటేనే పనులు చేసేందుకు అర్హత పొందుతారు. ఇప్పటికే జాబ్ కార్డు ఉన్న కూలీలతో వారి ఆధార్ కార్డులతో అనుసంధానం చేశారు. ప్రస్తుతం వారి ఫొటోలను తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ విధంగా అప్‌లోడ్ చేయడంతో మృతి చెందిన వారి కార్డు, నిరుపయోగంగా ఉన్న కార్డులను తొలగిపోయే అవకాశాలు ఉంటాయి. అంతేకాకుండా నకిలీ కార్డులను తొలగిస్తారు.

47.46 శాతం పూర్తి

ప్రస్తుతం జిల్లాలో ఉపాధిహామీలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. జిల్లాలో 2,08,545 మంది కూలీలు యాక్టివ్‌గా ఉన్నారు. ఇప్పటివరకు 98,968 మంది నమోదు ప్రక్రియ పూర్తి అయింది. 47.46 శాతం నమోదు అయ్యింది. చౌటకూరు, పటాన్‌చెరు మండలాల్లో నమోదు ప్రక్రియలో అతితక్కువగా ఉన్నాయి. ప్రతికూలి వద్దకు వెళ్లి సంబంధిత వ్యక్తి ఫొటో క్యాప్చర్ చేసి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. పూర్తి వివరాలను ఉపాధిహామీ పథకంలోని ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం)లో అప్‌లోడ్ చేయనున్నారు. అందరి సహకారంతో జిల్లాలో త్వరితగతిన నమోదు ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

ఎంపీ చిత్రపటంతో గృహ ప్రవేశం



ఎంపీ చిత్రపటంతో గృహ ప్రవేశం చేస్తున్న లబ్ధిదారులు

జహీరాబాద్ టౌన్: మాట సహాయం చేసిన జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌పై అభిమానంతో ఆయన చిత్రపటం తీసుకుని లబ్ధిదారు కుటుంబ సభ్యులు డబుల్ బెడ్రూం ఇంటిలో గృహం ప్రవేశం చేశారు. పట్టణ సమీపంలో హోతి(కె) వద్ద బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారు. సాధారణ ఎన్నికలకు ముందే లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక చేపట్టి రెవెన్యూ అధికారులు సర్టిఫికెట్లను అందజేశారు. ఇళ్ల నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉన్నందున అప్పట్లో ఇళ్ల తాళాలు ఇవ్వలేదు. నిర్మాణం పనులు దాదాపు పూర్తి కావడంతో ఇటీవల లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించారు. అయితే శాంతినగర్‌కు చెందిన వందన చవాన్‌కు కూడా ఇల్లు మంజూరయింది. పొరపాటున ఆమె నివాసం ఉంటున్న శాంతినగర్‌కు బదులు అడ్రాస్‌లో మరో వార్డు పేరు నమోదు అయింది. వందన చవాన్ అనే మహిళా తమ వార్డులో ఎవరూ లేరని విచారణ సమయంతో తేలడంతో ఆమెకు ఇల్లు కేటాయించలేదు. విషయం తెలుసుకున్న ఆమె స్థానిక నాయకులు రాములు నేత ద్వారా ఎంపీ సురేశ్ షెట్కార్‌ను కలిసి జరిగిన పొరపాటు గురించి చెప్పారు. అడ్రాస్ జరిగిన పొరపాటు గురించి ఎంపీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు మరోసారి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. వందన చవాన్ అర్హులని తేలడంతో ఇంటి తాళాలు అప్పగించారు. ఈ మేరకు ఆదివారం సహాయం చేసిన ఎంపీ సురేశ్ షెట్కార్ చిత్రపటం పట్టుకుని కుటుంబ సభ్యులతో కలిసి గృహ ప్రవేశం చేశారు.

టోర్నీలో విజేతగా క్రిస్టియన్ కాలనీ జట్టు



విజేతలకు కప్ అందజేసిన కుమార్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ అల్లీపూర్ ఎంఆర్‌హెచ్ఎస్ క్రీడామైదానంలో వారం రోజుల పాటు జరిగిన మెథడిస్టు లాంగ్ బౌండరీ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగిశాయి. లీగ్ మ్యాచ్‌లను నెగ్గి ఫైనల్‌కు చేరిన క్రిస్టియన్ కాలనీ, అల్లీపూర్ క్రికెట్ జట్ల మధ్యన హోరాహోరీగా మ్యాచ్ జరిగింది. ఫైనల్‌లో క్రిస్టియన్ కాలనీ జట్టు కప్ కైవసం చేసుకుంది. విజేత జట్టుకు నిర్వాహకులు రూ.20.999 నగదు, కప్ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన అల్లీపూర్ జట్టుకు రూ. 14.999 నగదు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో మెథడిస్టు చర్చి జిల్లా సూపరింటెండెంట్ రెవరెండ్ సుకుమార్, జిల్లా లే లీడర్ సరిన్‌జాన్, జిల్లా కార్యదర్శి వై.రవికుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ సబిత, ఎంవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు స్నేహిత షీల్ పాల్గొన్నారు.

ధాన్యానికి దక్కని గిట్టుబాటు ధర

- కనీస మద్దతు ధర, మార్కెట్ ధరల్లో భారీ వ్యత్యాసం
- పంట అమ్ముకునేందుకు అవస్థలు
- ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



మార్కెట్‌కు తెచ్చిన ఉత్పత్తులు

జహీరాబాద్: భారీ వర్షాల కారణంగా వానాకాలం పంటలు పెద్ద మొత్తంలో దెబ్బతిన్నాయి. మిగిలిన కొద్ది పాటి పంటలను విక్రయించుకుందామంటే గిట్టుబాటు ధర లభించక పోవడం రైతులను కలవరపెడుతోంది. వర్షాకాలం ఆరంభం నుంచి వారం రోజుల క్రితం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిశాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లో సాగులో ఉన్న పెసర, మినుము, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎర్ర నేలల్లో సాగు చేసుకున్న వాటిలో కొంత మేర పంట చేతికి వచ్చింది. వచ్చిన పంటను విక్రయించుకునేందుకు జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు తీసుకెళ్తే గిట్టుబాటు ధరలు లభించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల వల్ల పంట నాణ్యత దెబ్బతిన్న కారణంగా ధరరాని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం అయినా కొనుగోలు చేసుకుంటే గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు ఆశిస్తున్నారు. అయినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవడం లేదు. ప్రస్తుతం మార్కెట్లో పెసర పంటకు క్వింటాలు ధర నాణ్యతను బట్టి రూ.2,100 నుంచి రూ.4,500 ధర పలుకుతోంది. మినుము పంటకు రూ.2,800 నుంచి రూ.6,010 ధర పలుకుతోంది. సోయాబీన్‌కు రూ.2,700 నుంచి రూ.4,300 ధర లభిస్తోంది. మొక్కజొన్న పంటకు రూ.1,925 నుంచి రూ.2,025 పలుకుతోంది. ఈ ధర తమకు గిట్టుబాటుగా లేదని రైతులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయా పంటలకు కనీస మద్దతు ధరను ప్రకటించింది. వాటిలో పెసర్లకు క్వింటాలు ధర రూ.8,768, మినుములకు రూ.7,800, మొక్కజొన్నకు రూ.2,400, సోయాబీన్‌కు రూ.5,328ల మేర నిర్ణయించింది. వ్యాపారులు మార్కెట్లో కొనుగోలు చేస్తున్న ధరకు, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు భారీగా వ్యత్యాసం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. సోయాబీన్, మొక్కజొన్న ఉత్పత్తులు ఇప్పుడిప్పుడే విక్రయం నిమిత్తం మార్కెట్‌కు రైతులు తీసుకువస్తున్నారు. మరో పక్షం రోజులయితే ఆయా ఉత్పత్తులు మార్కెట్‌కు అధికంగా తరలిరానున్నాయి. అప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఆరు గ్యారంటీల అమలులో విఫలం

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



మాట్లాడుతున్న చంటి క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని ఖమ్మంపల్లి, పోల్కంపల్లి గ్రామ శివారులో తాజా మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను నమ్మించారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే రూ.50 లక్షలు మంజూరు చేసి గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి



ఆందోళన చేస్తున్న దళిత సంఘాలు

నారాయణఖేడ్: కంగ్టి మండలం భీమ్రా గ్రామంలో పోలియో చుక్కలు వికటించి మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. బాధ్యులైన వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రి గేటు ఎదుట రహదారిపై చిన్నారి బంధువులతో కలిసి దళిత సంఘాల బాధ్యులు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. చిన్నారి మృతి కుటుంబీకులకు తీరని శోకాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత సంఘాల బాధ్యులను పోలీసులు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.

బెంబేలెత్తిస్తున్న శునకాలు

ఆందోళన చెందుతున్న జనం



వసుంధర కాలనీలో సంచరిస్తున్న వీధికుక్కలు

జహీరాబాద్: పట్టణంలోని అనేక కాలనీల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారం గడి, అహ్మద్‌నగర్ కాలనీల్లో పిచ్చికుక్క పలువురిపై దాడి చేసింది. ఈ దాడిలో 16 మంది గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. పట్టణంలోని ఏ కాలనీలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతుండటం, తరచూ జనాలను కరుస్తుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గత ఆరు నెలల క్రితం మున్సిపల్ అధికారులు కుక్కలను తరలించే కార్యక్రమం చేపట్టినా అది మొక్కుబడిగానే సాగడంతో ప్రతి గల్లీలో కుక్కల గుంపులు దర్శనమిస్తున్నాయని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉంటే పందులు సైతం పట్టణంలో పెద్ద సంఖ్యలో ఉండటం, పరిసరాలను అపరిశుభ్రం చేస్తుండటంతో ఎక్కడ రోగాల బారిన పడతామోనని ప్రజలు వాపోతున్నారు. పందులను సైతం తరలించే ఏర్పాట్లు చేయాలని అధికారులకు స్థానికులు విన్నవించుకుంటున్నారు.

హైందవులను ఐక్యం చేసే ఆర్ఎస్ఎస్



ప్రదర్శన చేస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు



జోగిపేటలో ఆర్ఎస్ఎస్ సేవల మార్చ్

జోగిపేట(అందోల్): దేశంలో హిందువులను సంఘటితం చేస్తూ అభివృద్ధి పథంలో దేశాన్ని ముందుకు నడిపించేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)కృషి చేస్తోందని సంగారెడ్డి జిల్లా సహ బౌద్ధిక్ మేకల సురేశ్ అన్నారు. ఆదివారం జోగిపేటలో నిర్వహించిన పథ్ సంచాలన్ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సేవకులను ఉద్దేశించి మాట్లాడారు. వంద సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ నేడు దేశంలో లక్షకు పైగా శాఖలతో దినదినాభివృద్ధి చెందిందన్నారు. వివిధ మతాలను సమన్వయ పరిచే సనాతన ధర్మజీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయన్నారు.

వందలాది మందితో సేవకులతో మార్చ్

జోగిపేట పట్టణంలో జోగిపేట ఖండ్ పరిధిలోని 50 గ్రామాలకు చెందిన వందలాది మంది ఆర్ఎస్ఎస్ సేవకులతో ప్రధాన రహదారుల గుండా మార్చ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో జోగిపేట ఖండ్ సంఘ సంచాలక్ తీర్థల సుబ్రహ్మణ్యం, స్వయం సేవకులు మను బ్రహ్మబస్వరాజ్, రుద్రారం కరుణేశ్వర్, పండరీనాథ్, ఆకుల నరేశ్ పాల్గొన్నారు.

ఖేడ్‌లో పథ్ సంచాలన్

నారాయణఖేడ్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఖేడ్‌లో ఆర్ఎస్ఎస్ ఖేడ్ నగర శాఖ ఆధ్వర్యంలో పథ్ సంచాలన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీరామమందిరం నుంచి పట్టణ ప్రధాన రహదారుల గుండా ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌లోని భవానీమాత ఆలయం వరకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పూర్ణగణవేష్ ధరించి ప్రదర్శన చేశారు.

బకాయిలను తక్షణమే విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలల కాలం పూర్తయితున్నప్పటికీ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని ధ్వంసం చేస్తూ విద్యార్థులను విద్యకు దూరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనార్టీ విద్యార్థులు బెస్ట్ అవైలేబుల్ స్కీం ద్వారా పలు ప్రైవేట్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ బకాయిలు ఇవ్వకపోవడంతో ప్రైవేట్ యజమాన్యాలు విద్యార్థులను స్కూళ్లకు రావద్దని చెబుతున్నారని వాపోయారు. బకాయిలు విడుదల చేయని యెడల జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, జిల్లా నాయకులు శ్రీకాంత్, అనిల్, మౌనిక, దివ్య, ఆకాశ్, సిద్దు ,అశ్విని, సోని, ఇస్మాయిల్, వాసు, సప్న, శ్రీనిధి, వాసవి, దినేశ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ జిల్లా వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా పోలియో చుక్కలు వేశారు. మిగిలిన చిన్నారులకు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు వెళ్లకుండా తప్పనిసరిగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకోవాలని వైద్యాధికారులు సూచించారు.



న్యాల్‌కల్: పోలియో చుక్కలు వేస్తున్న వైద్యుడు



వట్‌పల్లి: చుక్కల పంపిణీలో మెడికల్ ఆఫీసర్..



హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..



కల్హేర్:చుక్కలు వేస్తున్న డాక్టర్ జెబా శాహేమిన్



నారాయణఖేడ్ వలస చిన్నారులకు..



పటాన్‌చెరు: జీహెచ్ఎంసీ ఆఫీస్ ఆవరణలో..



పటాన్‌చెరు టౌన్: చిట్కుల్ ఆస్పత్రి ఆవరణలో..



మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..



జహీరాబాద్ టౌన్: చుక్కలు చేస్తున్న విద్యార్థిని



పటాన్‌చెరు: చుక్కలు వేస్తున్న కోమలి